

## సక్సెస్ స్టోరీ
### ఫొటో ఫ్రేమ్ అందజేత

వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ని శనివారం వరంగల్ వాయిస్ దినపత్రిక ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆమె సక్సెస్ స్టోరీకి సంబంధించిన ఫొటో ఫ్రేమ్ ను అందజేశారు.

–వరంగల్ వాయిస్, వరంగల్


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 027
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
జనవరి 03, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





# షిఫ్టింగ్ భారం

## క్లర్క్‌కు రూ.4వేలు
## అటెండర్‌కు రూ.2 వేలు

- ప్రభుత్వ కార్యాలయాల షిఫ్టింగ్ భారం సిబ్బందిపైనే
- లబోదిబోమంటున్న ఉద్యోగులు
- పైసా విడుదల చేయని ప్రభుత్వం
- సమస్యగా మారిన ఫర్నీచర్ తరలింపు

వివరాలు2లో..

ఖజానాకు భారంగా మారిన అద్దెల చెల్లింపు వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటి వరకు అద్దె భవనాల్లో ఉంటున్న ప్రభుత్వ కార్యాలయాలను డిసెంబర్ 31, 2025 నాటికి ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదన్నారు. జనవరి తర్వాత ప్రైవేట్ భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు ఎటువంటి అద్దె చెల్లించబోమంటూ పేర్కొన్నారు. ఈ మేరకు మెమో 3469202–ఏ/310/డబ్ల్యూపీ/ఏ1/2025 జారీ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ కార్యాలయాల తరలింపునకు ప్రభుత్వం పైసా విడుదల చేయకపోవడం అధికారులకు ప్రాణసంకటంగా మారింది. ఆయా కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తలా కొంత వేసుకొని షిఫ్టింగ్ చేసుకోవాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. క్లర్క్ కు రూ.4 వేలు, అటెండర్ కు రూ.2 వేలు చొప్పున పోగుచేసి వచ్చిన డబ్బులతో ప్రభుత్వ కార్యాలయాల్లోని ఫర్నీచర్, ఇతరత్ర సామగ్రిని తరలిస్తున్నారు. కార్యాలయాల తరలింపు సిబ్బందికి అదనపు భారంగా మారడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. – వరంగల్ వాయిస్ ప్రతినిధి



8లో..

# సమష్టిగా కొండగట్టు అభివృద్ధి

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



2లో..

# స్త్రీ విద్యకు పునాది సావిత్రి బాయి పూలె

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




# షిఫ్టింగ్ భారం

- క్లర్క్ కు రూ.4వేలు
- అటెండర్ కు రూ.2 వేలు
- ప్రభుత్వ కార్యాలయాల షిఫ్టింగ్ భారం సిబ్బందిపైనే
- లబోదిబోమంటున్న ఉద్యోగులు
- పైసా విడుదల చేయని ప్రభుత్వం
- సమస్యగా మారిన ఫర్నీచర్ తరలింపు





**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్ర ఖజానాపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించే దిశగా తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ కార్యాలయం కూడా అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మెమో 3469202–ఏ/310/డబ్ల్యూపీ/ఏ1/2025 జారీ చేశారు. డిసెంబర్ 31వ తేదీని తుది గడువుగా నిర్ణయిస్తూ.. కొత్త ఏడాది నుంచి పరిపాలన అంతా సొంత భవనాల్లోనే సాగాలని ఆదేశించారు. డిసెంబర్ 31 లోపు ప్రైవేటు భవనాలను ఖాళీ చేసి.. అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లోకి మారాలని సూచించారు. ఫిబ్రవరి 1 నుంచి ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లింపులను నిలిపివేయాలని ట్రెజరీ విభాగానికి సర్క్యులర్ జారీ అయింది. గడువు దాటిన తర్వాత కూడా అద్దె భవనాల్లోనే కొనసాగితే... ఆ అద్దెను సంబంధిత శాఖాధికారి తన వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### అద్దె భారం తగ్గించేందుకే..

ప్రతి ఏటా ప్రభుత్వం అద్దె రూపంలో కోట్లాది రూపాయలను ప్రైవేటు భవన యజమానులకు చెల్లిస్తోంది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఆదాయం వృథా కాకుండా కాపాడవచ్చు. సొంత భవనాలు ఖాళీగా ఉండగా.. అద్దె భవనాల కోసం ప్రజా ధనాన్ని వెచ్చించడం సరికాదని ప్రభుత్వం భావిస్తోంది అన్ని కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లోకి మారడం వల్ల ప్రజలకు కూడా ఒకే ప్రాంగణంలో వివిధ సేవలందే అవకాశం ఉంటుంది. అన్ని శాఖల ప్రత్యేక కార్యదర్శులు, విభాగాధిపతులు వెంటనే తమకు అనువైన ప్రభుత్వ స్థలాలను పరిశీలించి.. బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎస్ కె.రామకృష్ణారావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క ప్రభుత్వ బోర్డు కూడా ప్రైవేటు భవనంపై కనిపించకూడదన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనపడుతోంది.

### అనేక సమస్యలు..

గత కొంత కాలంగా ప్రభుత్వానికి చెందిన పలు భవనాలు నిరుపయోగంగానే ఉన్నాయి. అక్కడ కావాల్సిన సదుపాయాలు లేకపోవడంతో పలు కార్యాలయాలు ఇంతకాలం ప్రైవేట్ భవనాల్లో విధులు నిర్వర్తించాయి. చాలా భవనాలు వినియోగంలో లేకపోవడంతో అక్కడ సమస్యలు తిష్ట వేశాయి. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎంతో కాలంగా విద్యుత్ బిల్లులు పెండింగ్ లో ఉన్నందున వాటిని చెల్లిస్తేగాని విద్యుత్ సరఫరాను పునరుద్దరించలేమంటూ ఆయా శాఖ అధికారులు ప్రకటిస్తున్నారు. దీనితో పాటు కనీస వసతులు కరువయ్యాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### సిబ్బందిపైనే భారం..

తక్షణమే ప్రభుత్వ భవనాల్లోకి తమ కార్యాలయాలను తరలించాలంటూ ఆదేశించిన ప్రభుత్వం అందుకు కావాల్సిన నిధులను మాత్రం విడుదల చేయలేదు. ఒక్కో కార్యాలయంలోని బీరువాలు, టేబుల్లు, కుర్చీలు, ఏసీలు, ఇతర ఫర్నీచర్ తరలించేందుకు కనీసం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతోంది. ఈ మొత్తాన్ని ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది, ఉద్యోగులు తలా ఇంత వేసుకొని కార్యాలయాలను తరలిస్తున్నారు. ఫిబ్రవరి 1 నుంచి అద్దె చెల్లించబోమంటూ ప్రకటించిన ప్రభుత్వం కార్యాలయాల షిఫ్టింగ్ కు కావాల్సిన నిధులను కూడా విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందని, ఇది సిబ్బందికి అదనపు భారంగా మారిందని ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

# స్త్రీ విద్యకు పునాది సావిత్రి బాయి పూలె

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

**వరంగల్ వాయిస్, గిర్మాజీపేట :** సామాజిక సంస్కర్త సావిత్రి బాయి పూలె జయంతి సందర్భంగా శనివారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ నగరం గిర్మాజీపేటలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ.. సావిత్రి బాయి పూలే భారతదేశ విద్యా చరిత్రలో ఒక ధ్రువతార, అణగారిన వర్గాల ఆశాదీపమని, ఆమె కేవలం ఒక మహిళా ఉపాధ్యాయురాలు మాత్రమే కాదు, సమాజంలోని మూఢనమ్మకాలను ఎదిరించిన గొప్ప విప్లవకారిణి అన్నారు. వితంతువుల కోసం ఆశ్రమాలు కల్పించడం, అంటరానితనం నిర్మూలనకు కృషి చేయడం వంటి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, జిల్లా కార్యదర్శి గోకే వెంకటేష్, జిల్లా నాయకులు పొట్టి శ్రీనివాస్ గుప్తా, సిద్దోజు శ్రీనివాస్, ఎల్లబోయిన చంద్ర మోహన్, శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, మండల నాయకులు మామిడాల సతీష్, అక్కినే సాగర్, సాంబరాజు కమలాకర్, తమ్మిశెట్టి క్రాంతి కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జాతరకు సహకరించండి

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అమ్మవారిపేట శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరకు కావాల్సిన బందో బస్తు ఏర్పాటు చేసి సహకరించాలని జాతర ఛైర్మన్ కోడూరి భిక్షపతి, ఆర్గనైజర్ దాసి రాందేవ్ కోరారు. ఈ మేరకు శనివారం మడికొండ ఇన్ స్పెక్టర్ కిషన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. జనవరి 28 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి రానున్నట్లు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా కావాల్సిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బైరి నాగరాజు, రామ్మూర్తి, నీలారపు రంజిత్, ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మహాసుదర్శన నరసింహ హవనం

- ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా విశేష పూజలు
- శ్వేతార్క క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తజనం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం స్వయంభు శ్రీ శ్వేతార్క మూల మహాగణపతి దివ్య క్షేత్రం శనివారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. క్షేత్రంలో కొలువుదీరి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా, పౌర్ణమి, ఆరుద్ర నక్షత్ర విశేషాన్ని పురస్కరించుకొని 'శ్రీ సుదర్శన నరసింహ శతక హవనము' అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు టంటం దయాకర్ స్వామి నేతృత్వంలో తిరుప్పావై పాశుర సేవలు, విష్ణు సహస్రనామ పారాయణం, మహా హారతి నిర్వహించారు. అనంతరం క్షేత్రపాలకుడైన యోగ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపి, నిత్య సహస్ర మోదక శ్వేతార్క గణపతి మూలమంత్ర హోమాలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. బ్రహ్మశ్రీ వేద పండితులు ప్రశాంత్ శర్మ బ్రహ్మత్వంలో, ఆలయ వైదిక నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, పరిపాలన నిర్వాహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ నేతృత్వంలో సుదర్శన యంత్ర పూజ, మూలమంత్ర శతక హవనము నిర్వహించారు. ఆలయ అర్చకులు హరికృష్ణ స్వామి, ఆనంద్ త్రిపాఠి, మనోజ్, రోహిత్, శివం తదితరులు వేద మంత్రోచ్చారణలతో హోమ క్రతువును దిగ్విజయంగా పూర్తి చేశారు. ఈ విశేష హోమ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామివారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులైన భక్తులు క్షేత్రంలో అన్నపూర్ణ భవనంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవాలయ కార్యకర్తలు లక్కు రవి, తుమా శ్రీనివాస్, వీరేందర్, రాజిరెడ్డి, మహేష్, అనంత కృష్ణ, ధృవంత కృష్ణ, రవీంద్రనాథ్, రాజ్ కుమార్, శ్యాం, సునందన, కల్పన, ఉమారాణి, కోటేశ్వరరావు, సీనమ్మ, భాగ్యలక్ష్మి, సుజాత, ధనుర్మాస ఉత్సవ నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మేడారం ప్రధాన పూజారి అరాచకాలను అడ్డుకోవాలి



### దళిత సంఘాల జేఏసీ డిమాండ్

**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ప్రధాన పూజారి సిద్దబోయిన జగ్గారావు అరాచకాలు, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ జిల్లా ఛైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో జగ్గారావుతో పాటు ఆయన బినామీ, భూకబ్జాదారుడు ముదురుకోల సదానందంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాదాసి సురేష్ మాట్లాడుతూ.. మేడారం జాతర సమీపంలోని సర్వే నెంబర్ 20లో ఆదివాసీ గిరిజనుడైన మల్యాల లింగరాజుకు వారసత్వంగా వచ్చిన 30 గుంటల భూమిని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూమిపై కన్నేసిన ప్రధాన పూజారి జగ్గారావు, గిరిజనేతరుడైన సదానందంతో కలిసి వ్యాపారులకు కిరాయికి ఇస్తూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెద్ద సంఖ్యలో గుర్తుతెలియని వ్యక్తులను తీసుకువచ్చి బాధిత కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క పేరును వాడుకుంటూ ఆమెకు చెడ్డపేరు తెస్తున్న పూజారి జగ్గారావు ఆగడాలను అరికట్టాలని సురేష్ కోరారు. మంత్రి వెంటనే స్పందించి ఆదివాసీ కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో దళిత, గిరిజన, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కలకోటి మహేందర్, బీఆర్ఎస్ నాయకుడు మట్ల రాజ్ కుమార్, సామాజిక కార్యకర్త పెరుక భాస్కర్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు మల్యాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐది వందేళ్ల త్యాగాల చరిత్ర

- ఖమ్మం 'శత వార్షికోత్సవ' సభను జయప్రదం చేయండి
- కేంద్రం ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూస్తోంది
- తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- గోడపత్రిక ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, శివనగర్ :** దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, వందేళ్ల సుదీర్ఘ త్యాగ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) అని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం వరంగల్ శివనగర్‌లోని 'తమ్మెర భవన్'లో ఈనెల 18న ఖమ్మంలో జరగనున్న సీపీఐ శత వార్షికోత్సవ ముగింపు జాతీయ సభ గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సోషలిజం ధ్యేయంగా, సామాజిక న్యాయం, లౌకికవాదం కోసం సిపిఐ పోరాడుతోందన్నారు. స్వాతంత్ర పోరాటంలో వేలాది మంది అమరవీరులను అందించిన చరిత్ర తమదన్నారు. "దున్నేవాడికే భూమి" నినాదంతో లక్షలాది ఎకరాలను పేదలకు పంచిందని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం చేసి వేలాది గ్రామాలను విముక్తి చేసిన ఘనత సిపిఐకే దక్కుతుందని గుర్తుచేశారు. దేశభక్తి ముసుగులో బీజేపీ ప్రభుత్వం అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. అరావళి పర్వతాలను మైనింగ్ పేరిట కట్టబెడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ పాలనలో నిరుద్యోగం, పేదరికం రెట్టింపు అయ్యాయని, సామాన్యుల సంక్షేమాన్ని కేంద్రం విస్మరించిందని ఆరోపించారు. గత 50 ఏళ్ల ప్రజా ఉద్యమాలపై నివేదికలు కోరడం.. ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేయడానికేనని, అమిత్ షా చర్యలు రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేశారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు జిల్లాలోని జర్నలిస్టులు, మేధావులు, సామాన్య ప్రజలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజల రమేష్, నాయకులు పనస ప్రసాద్, గన్నారపు రమేష్, బుస రవీందర్, గుండె బద్రి, తాళ్లపల్లి రాహేలా, ఓర్స్ రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు లాదెల శరత్, దిడ్డి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# 'జీ రాంజీ' పథకాన్ని రద్దు చేయాలి

- ఏఐకేఎంఎస్ నాయకుల పిలుపు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'జీ రాంజీ' ఉపాధి పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) డిమాండ్ చేసింది. వరంగల్‌లో రెండు రోజుల పాటు జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారంతో ముగిసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య ముఖ్య అతిథిగా హాజరై కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన కొత్త ఉపాధి పథకానికి వ్యతిరేకంగా ఈనెల 6 నుంచి 24 వరకు గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో ఉధృత పోరాటాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గ్రామసభల్లో పథకానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి. సంక్రాంతి భోగి మంటల్లో కేంద్రం తెచ్చిన కొత్త చట్ట ప్రతులను దగ్ధం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ వేతనాన్ని రూ. 600లకు పెంచాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, ప్రీపెయిడ్ విద్యుత్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను ఆపాలని హెచ్చరించారు. బహుళజాతి సంస్థలైన మోన్సాంటో, డ్యూపాయింట్ వంటి కంపెనీల ప్రయోజనాల కోసం రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించడం తగదన్నారు. రబీ సీజన్ ప్రారంభమైనా రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే ఎరువులను మొదటి ప్రాధాన్యతగా తెలంగాణ రైతులకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. కరువు, పేదరికం ప్రాతిపదికన కృష్ణా, గోదావరి జలాల పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో సంఘం గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, నాయకులు బండారి ఐలయ్య, గుజ్జు దేవేందర్, నందగిరి వెంకటేశ్వర్లు, డేవిడ్ కుమార్, తుపాకుల నాగేశ్వరరావు, రాచర్ల బాలరాజు, బొమ్మిడ సాంబయ్య, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి 'సీతక్క' భరోసా

- ప్రెస్ క్లబ్ అభివృద్ధికి రూ.35 లక్షల నిధులు
- సీతక్క చిత్రపటానికి పాలాభిషేకం




**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ (సీతక్క) జర్నలిస్టుల సంక్షేమం పట్ల తన ఉదారతను చాటుకున్నారు. ఏటూరునాగారం ప్రెస్ క్లబ్ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రూ.35 లక్షల నిధులను మంజూరు చేయించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక జర్నలిస్టులు, అభిమానులు మంత్రి సీతక్క చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. జర్నలిస్టులు వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఈ నిధులను కేటాయించారు. ఈ నిధులతో ఆధునిక వసతులు కల్పిస్తారని, ఇది జర్నలిస్టులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న మంత్రి సీతక్కకు ఈ సందర్భంగా జర్నలిస్టులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులకు అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. ఈ పాలాభిషేక కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, వివిధ పత్రికల విలేకరులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీతక్క అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీలో చేరికలు

## కమలం గూటికి సంఘాల సాంబరాజు



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలో భారతీయ జనతా పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేరికలు కొనసాగుతున్నాయి. శనివారం లాదెల్ల గ్రామానికి చెందిన ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి సంఘాల సాంబరాజు తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కొత్తగూడెం జిల్లా ఇంచార్జి డాక్టర్ పేసరు విజయ్ చందర్ రెడ్డి సాంబరాజుకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సాంబరాజు వంటి ఉద్యమకారుల చేరికతో దామెర మండలంలో పార్టీ మరింత పటిష్టమౌతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ చేరికల కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి, దామెర మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రమేష్ ముదిరాజ్, బూత్ అధ్యక్షులు రోహిత్, శ్రీకాంత్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడికూడ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా రవీందర్ యాదవ్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నార్లపూర్ గ్రామ సర్పంచ్ పెద్దబోయిన రవీందర్ యాదవ్ ఎన్నికయ్యారు. మండలంలోని సర్పంచులందరూ ఏకాభిప్రాయంతో రవీందర్ యాదవ్ నాయకత్వాన్ని బలపరుస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా పెండ్లి లక్ష్మి (రామకృష్ణాపురం సర్పంచ్), కార్యదర్శిగా కొంగటి తిరుపతి (కంటాత్మకూర్ సర్పంచ్), ఉపాధ్యక్షుడిగా రాజు జగత్ ప్రకాష్ (రాయపర్తి సర్పంచ్)లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు మల్లాల్ రావు (నడికూడ), రేణుక (చర్లపల్లి), రూప (చోటుపర్తి), ఎల్లస్వామి (ధర్మారం), శ్రీలత (కౌకొండ), వెంకటేష్ (ముస్తాలపల్లి), ముత్యాలు (నర్సక్కపల్లి), రాధ (పులిగిల్ల), శ్రీలత (సర్వాపూర్), కుమారస్వామి (వరికోల్) తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అప్పం కుమార్ స్వామి, ఇతర మండల స్థాయి నాయకులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆరె కుల ప్రజాప్రతినిధులను గౌరవించుకోవడం మన బాధ్యత

## నాగూర్ల వెంకటేశ్వరరావు



**వరంగల్ వాయిస్, నడికూడ :** హన్మకొండలోని భవాని నగర్‌లో శనివారం సందడి నెలకొంది. నూతనంగా ఎన్నికైన ఆరె కుల ప్రజాప్రతినిధులు ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. నడికూడ గ్రామ నూతన సర్పంచ్ కుడ్ల మలహాలరావు, వరికోల్ గ్రామ ఉపసర్పంచ్ మురాల భుజంగరావు గార్లు వెంకటేశ్వరరావుకి పూలమొక్కను అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగూర్ల వెంకటేశ్వరరావు నూతన సర్పంచ్ మలహాలరావు, ఉపసర్పంచ్ భుజంగరావులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కుల బాంధవులు రాజకీయంగా ఎదగడం హర్షణీయమని, ప్రజా సమస్యల పరిష్కారంలో వారు ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. ఆరె కుల మండల అధ్యక్షులు లోకటి నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు వరికెల కిషన్ రావు, నడికూడ ఆరె కుల యువ నాయకులు మోకిడి రాజు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

# విద్యతోనే మహిళా సాధికారత సాధ్యం

▪ డిస్నీల్యాండ్ పాఠశాల యాజమాన్యం




**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలో గల డిస్నీల్యాండ్ ఉన్నత పాఠశాలలో భారత దేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సమాజ సంస్కర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు డి.సదయ్య, బి.లక్ష్మీనివాసం, డైరెక్టర్లు బాలుగు శోభారాణి, డి.మీనా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రసంగాలు, సావిత్రిబాయి సేవలను స్మరించుకున్న తీరు అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, మీనా దినేష్ మాట్లాడుతూ.. ఒకప్పుడు మహిళలు వంటింటికే పరిమితమయ్యేవారని, కానీ నేడు చంద్రమండలం వరకు దూసుకుపోతున్నారంటే దానికి ప్రధాన కారణం విద్యే అని నొక్కి చెప్పారు. సావిత్రిబాయి పూలే పడిన కష్టమే నేడు మహిళలు అనుభవిస్తున్న స్వేచ్ఛకు పునాది అని వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో 9వ తరగతి విద్యార్థిని బుద్దె శ్రీహర్ష సావిత్రిబాయి పూలే వేషధారణలో చేసిన ఏకపాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన నటనతో నాటి పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించి తోటి విద్యార్థుల ప్రశంసలు అందుకుంది. వ్యవస్థాపకులు సదయ్య, లక్ష్మీనివాసం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "అమ్మాయిలు స్వేచ్ఛను సద్వినియోగం చేసుకుంటూ, క్రమశిక్షణతో కష్టపడి చదవాలి. దేశంలోని గొప్ప మహిళా మూర్తుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## విద్యతోనే మహిళా విముక్తి సాధ్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళా విద్యకు మూలస్తంభం, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బింగి శ్రీనివాస్ కొనియాడారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్‌లో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బింగి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలబోజు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి పేరుగు సురేష్, జిల్లా నాయకులు సిరిమల్ల పున్నం చందర్, తుల కిషోర్, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే

హైకోర్టు అడ్వకేట్ భాగ్యలక్ష్మి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజం కోసమే జీవించి, సమాజ హితం కోసమే మరణించిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని హైకోర్టు అడ్వకేట్ భాగ్యలక్ష్మి కొనియాడారు. శనివారం కొత్తవాడ బ్యాంక్ కాలనీలోని ఏకశిలా జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు జన్ను రమేష్ అధ్యక్షతన ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, నేటి సమాజంలో స్త్రీలను కేవలం భౌతిక, లైంగిక అవసరాలకు మరియు ఆర్థిక ప్రయోజనాల కోసం యంత్రాలుగా చూసే పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులను ఎదిరించి నిలబడాలంటే విద్య ఒక్కటే మార్గమని ఆమె స్పష్టం చేశారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని విద్యార్థినులు అన్ని రంగాలలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. స్త్రీల జీవన స్థితిగతులు మారాలంటే విద్య తప్పనిసరి అని నమ్మి, దేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మాలోత్ ప్రత్యూష, ఏఐఎఫ్ డీఎస్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, జిల్లా సహాయ కార్యదర్శి మార్తా నాగరాజ్, కళాశాల అధ్యాపకులు వాణి, స్వాతి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా చైతన్య ప్రతీక సావిత్రిబాయి



**వరంగల్ వాయిస్, గణపురం :** భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను గణపురం మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని శివశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్ పాల్గొని, సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బత్తిని శివశంకర్ గౌడ్ మాట్లాడుతూ.. మహిళలు చదువుకోవడానికి వీలులేని క్లిష్ట పరిస్థితుల్లో, మహాత్మా జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి అక్షరాస్యతను సాధించారని గుర్తుచేశారు. సమాజం నుండి ఎదురైన అవమానాలను, వివక్షను ధైర్యంగా ఎదుర్కొని మహిళా చైతన్యమే ధ్యేయంగా దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించారని కొనియాడారు. ఆమె వేసిన బాట నేడు కోట్లాది మంది మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ పోతార్ల మల్లికార్జున్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు ముక్కెర గౌతమి, దూడపాక దుర్గయ్య, నాయకులు అంకం శ్రీనివాస్, మార్క రమేష్, శ్రీపతి సాంబయ్య, అంకం రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పూలే దంపతుల సేవలు ఆదర్శం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి:** భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను భీమదేవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుమారస్వామి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు, బాలికలు విద్యావంతులు కావాలని నాటి కాలంలోనే సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కేవలం విద్యనే కాకుండా, వితంతు మహిళలకు ఉపాధి కల్పన కోసం ఆమె పడిన తపన ఆదర్శప్రాయమన్నారు. నేడు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి నాడే బీజం వేసిన గొప్ప దార్శనికులు పూలే దంపతులు అని ఆయన గుర్తు చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం వారు చేసిన పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. గ్రామ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థినులు సావిత్రిబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, లలిత, అశోక్, శ్యామ్, వెంకటేశ్వర్లు, విజయ, సంధ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మహిళా విద్యా వికాసానికి సావిత్రిబాయి స్ఫూర్తి



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మహిళా విద్య కోసం తన జీవితాన్ని ధారపోసిన అక్షర యోధుడు సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియాడారు. హసన్‌పర్తిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నాటి సమాజంలో మహిళలు చదువుకోవడానికి అనేక అడ్డంకులు ఎదురైనప్పటికీ, వాటన్నింటినీ ఎదిరించి విద్యను అందించిన ధైర్యశాలి సావిత్రిబాయి అని ప్రశంసించారు. ఆమె చేసిన సామాజిక పోరాటాలు, మహిళా విద్యాభ్యాసం కోసం చేసిన కృషి నేటి తరం విద్యార్థినులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించడమే మనం ఆమెకు ఇచ్చే నిజమైన గౌరవమని అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

# అక్షర యోధురాలు సావిత్రిబాయి పూలే

◆ నేదునూరి రాజమౌళి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలో అణగారిన వర్గాలకు, మహిళలకు విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన సామాజిక విప్లవోద్యమ నేత సావిత్రిబాయి పూలే అని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి కొనియాడారు. శనివారం సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. విద్య ద్వారానే మనిషి గౌరవప్రదంగా జీవించగలరని నమ్మిన మహాత్మా జ్యోతిరావు పూలే, తన సహచరి సావిత్రిబాయికి విద్య నేర్పించి సమాజ సేవకు పురికొల్పారని గుర్తుచేశారు. నాటి సనాతన ధర్మం పేరుతో శూద్రులకు, అతిశూద్రులకు, మహిళలకు నిరాకరించిన విద్యను సావిత్రిబాయి సాహసంతో అందరికీ చేరువ చేశారని, ఆమె ధైర్యం నేటి తరం మహిళలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. దేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. భారత్ బచావో రాష్ట్ర నాయకులు దొమ్మాటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మూఢవిశ్వాసాలపై, కుల వివక్షతపై సావిత్రిబాయి అక్షరాయుధంతో పోరాడారని ప్రశంసించారు. మనువాద సమాజంలోని వివక్షను చీల్చి చెండాడిన వీరవనిత ఆమె అని, నేటి సమాజంలోని రుగ్మతలపై పోరాడటమే ఆమెకు మనం అర్పించే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి, విద్యార్థి సంఘాల నాయకులు కాసరబోయిన రవితేజ, వేల్పుల ప్రభాకర్, దుస్స వెంకటేశ్వర్లు, నాగరాజు, కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొని సావిత్రిబాయి పూలే సేవలను స్మరించుకున్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులు రోడ్డున పడ్డారు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి
- మున్సిపాలిటీ పరిధిలో ఉత్సాహంగా 'బస్తీ బాట'
- నకిలీ ఓట్లపై కలెక్టరేట్ ముట్టడికి సై..



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** తెలంగాణను పదేళ్లపాటు అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్‌ది అయితే, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతులను రోడ్డున పడేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు సుభాష్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన 'బస్తీ బాట' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. కృష్ణా, సుభాష్ కాలనీల ప్రజల ఏళ్ల నాటి కలను నెరవేరుస్తూ జీవో 76 ద్వారా ఇళ్లకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చాం. భూపాలపల్లికి బస్ డిపో, మెడికల్ కాలేజ్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను తెచ్చిన ఘనత మాదే. ఒకప్పుడు మురికి కుంటలా ఉన్న ప్రాంతాన్ని నేడు ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్స్‌తో కూడిన అద్భుత క్రీడా ప్రాంగణంగా మార్చాం. నియోజకవర్గంలో తాగునీటి




సమస్య తీర్చడానికి ఇంటింటికీ గోదావరి జలాలను అందించాం. భూపాలపల్లి అభివృద్ధి కోసం తాను మంజూరు చేయించిన నిధులను ప్రస్తుత పాలకులు గణపురం మండలం బుద్ధారం గ్రామానికి మళ్లించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. చేసిన పనులకు మళ్లీ శిలాఫలకాలు వేస్తూ కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

### నకిలీ ఓట్లను తొలగించాలి..

ఓటర్ల జాబితాలో భారీగా చోటు చేసుకున్న అక్రమాలపై గండ్ర వెంకటరమణా రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా నకిలీ ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. 22వ వార్డులో కేవలం నాలుగు ఇంటి నెంబర్ల పైనే 500కు పైగా నకిలీ ఓట్లు ఉన్నాయని ఆధారాలతో సహా బయటపెట్టారు. ఒకే ఇంటి నెంబర్ పై 150 ఓట్లు ఉండటం విడ్డూరమన్నారు. ఇప్పటికే ఈ అంశంపై రిటర్నింగ్ అధికారికి వినతి పత్రం ఇచ్చామని, తక్షణమే ప్రత్యేక బృందాలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నకిలీ ఓట్లను తొలగించకుండా ఎన్నికలకు వెళ్తే ధర్నా చేపడతామని, అవసరమైతే ఎన్నికలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పట్టణ నాయకులు, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా 'అయ్యప్ప మహా పడిపూజ'



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** హనుమకొండలోని సుభద్ర కాంప్లెక్స్ శనివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అయ్యప్ప స్వామి మహాపడిపూజ మహోత్సవం ఇక్కడ అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది. మండల దీక్షలో ఉన్న స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో కాంప్లెక్స్ ప్రాంగణం శరణు ఘోషతో మారుమోగింది. పూజా కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప స్వామిని, గణపతి, లక్ష్మీదేవి విగ్రహాలను రంగురంగుల పుష్పాలు, రకరకాల పండ్లతో అత్యంత సుందరంగా అలంకరించారు. గురుస్వాముల వేద మంత్రోచ్ఛారణల మధ్య, ధూపదీప నైవేద్యాలతో కార్యక్రమం భక్తిపారవశ్యంలో సాగింది. గర్షల శ్రీనివాస్ – భవాని దంపతులు పీటలపై కూర్చుని స్వామివారికి కలశ పూజ, విశేష అర్చనలు మరియు అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. "స్వామియే శరణం అయ్యప్ప.. శరణం అయ్యప్ప" అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆ ప్రాంతమంతా శబరిమలను తలపించింది. పడిపూజను తిలకించిన భక్తులు స్వామివారి కృపకు పాత్రులై పులకించిపోయారు. పూజా కార్యక్రమాల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ భారీగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు క్రమశిక్షణతో ప్రసాదాన్ని స్వీకరించి, పూజను దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అయ్యప్ప స్వాములు, మాలధారులు, భక్తులు, హనుమకొండ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్, హనుమకొండలను కలిపి ఒకే జిల్లాగా మార్చాలి

- ఉమ్మడి జిల్లా ఉనికిని కాపాడాలని టీజేఎస్ డిమాండ్
- వరంగల్ ఎదగాలంటే ఏకీకరణే మార్గం



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** చారిత్రక నేపథ్యం ఉన్న వరంగల్ నగరాన్ని రాజకీయ కుట్రతో ముక్కలు చేసి, ఈ ప్రాంత అభివృద్ధిని గత పాలకులు అణచివేశారని తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ ఆరోపించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలను విలీనం చేసి, తిరిగి ఒకే వరంగల్ జిల్లాగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరిగిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే వరంగల్ నగరం హైదరాబాద్ తరహాలో మహా నగరంగా మారుతుందని ఇక్కడి నిరుద్యోగులు, విద్యార్థులు ఆశించారని, కానీ గత కల్వకుంట్ల ప్రభుత్వం వరంగల్‌ను ఆరు ముక్కలు చేసి భౌగోళిక ఐక్యతను దెబ్బతీసిందని శ్రీనివాస్ విమర్శించారు. 2017లో మేధావులు, ఉద్యమకారులు నగరాన్ని విభజించవద్దని ర్యాలీలు చేసినా, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారంతో లెక్కచేయలేదని మండిపడ్డారు. ఈ అశాస్త్రీయ విభజన వల్ల ఉమ్మడి జిల్లా నాయకత్వం నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో ఇతర జిల్లాలతో పోలిస్తే వరంగల్‌కు పెట్టుబడులు రాక, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని అంబటి శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్, ఖమ్మం, సిద్దిపేట పట్టణాల కంటే వరంగల్ వెనుకబడి పోయిందని చెప్పారు. కోయంబత్తూర్, పూణే, విశాఖపట్నం తరహాలో వరంగల్ ఎదగాలంటే ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రజలు వారిని ఓడించారని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం వరంగల్ మహానగరాన్ని ఒకే జిల్లాగా మార్చి ఉత్తర తెలంగాణ అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. హైదరాబాద్ జిల్లాలో 19 నియోజకవర్గాలు ఉన్నప్పుడు, వరంగల్‌ను మాత్రం ఎందుకు ముక్కలు చేశారని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులందరూ విభేదాలు పక్కన పెట్టి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఈ పాత్రికేయ సమావేశంలో టీజేఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు చిల్లా రాజేంద్రప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్షులు జావీద్, నాయకులు శ్రీనివాస్ పతి, ప్రభాకర్, రాధాకిషన్, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా 'శివ ముక్కోటి' ఏకాదశి



**వరంగల్ వాయిస్, రామన్నపేట:** నగరంలోని 29వ డివిజన్ పరిధిలో గల రామన్నపేట, పాపయ్యపేట శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం – శివ పంచాయతన క్షేత్రంలో శివ ముక్కోటి ఏకాదశి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆరుద్ర నక్షత్రం, శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము నుండే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు కక్కిరేణి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి, అనంతరం అత్యంత పవిత్రమైన 'ఉత్తర ద్వార దర్శనాన్ని' ప్రారంభించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ముక్కోటి ఏకాదశి కావడంతో ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దర్శనానంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ సిబ్బంది నవీన్, స్థానిక ప్రముఖులు శ్రీరాముల సురేష్, ఆనంద్ మోహన్, నాగ చందర్, సారయ్య, మిట్టపల్లి స్వామి, సనత్, గోపాల్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

# రేపు పద్మశాలి ప్రజాప్రతినిధులకు 'విక్టరీస్ ఫెలిసిటేషన్'

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసిన పద్మశాలి కుల ప్రజాప్రతినిధులను గౌరవించుకునేందుకు పద్మశాలి జర్నలిస్టుల సంఘం సిద్ధమైంది. 'విక్టరీస్ ఫెలిసిటేషన్' పేరిట పద్మశాలి సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభను ఆదివారం ఉదయం 10:30 గంటలకు హంటర్ రోడ్డులోని రాజ్ హోటల్ ప్రక్కన గల "వేద బంక్వెట్" హాల్‌లో నిర్వహించనున్నారు. పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్‌తో పాటు, పద్మశాలి విశ్రాంత ఉద్యోగుల సంఘం, పద్మశాలి డాక్టర్ల సంఘం సంయుక్తంగా ఈ భారీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి – ప్రభాకర్ లు హాజరుకానున్నారు. అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఈ సభలో పాల్గొని నూతన ప్రజాప్రతినిధులను సత్కరించనున్నారు. పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ.. పద్మశాలి సామాజిక వర్గం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కుల బాంధవులు, వివిధ విభాగాల బాధ్యులు, మేధావులు ఈ సమాచారాన్నే ఆహ్వానంగా భావించి పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శి వల్లాల వెంకట రమణ, కోశాధికారి వేముల సదానందం నేత, సంఘ సభ్యులు పాల్గొంటారు.

# దండు సురేందర్ కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి గ్రామ నివాసి దండు సురేందర్ ఇటీవల అకాల మరణం చెందడం పట్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ ఉపసర్పంచ్ పెంచాల రాజేందర్ (మెంతుల రాజు) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం సురేందర్ గృహాన్ని సందర్శించిన ఆయన, మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. సురేందర్ మరణం గ్రామస్థులకు మరియు వారి కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి వ్యక్తిగతంగా మరియు రాజకీయంగా ఎల్లవేళలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. నాయకులు కాశెట్టి సదానందం, ఈదునూరి స్వామి, రాజు, ఆనంద్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతికి సావిత్రిబాయి మార్గదర్శి

◆ కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు కాకతీయ విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా జరిగాయి. కేయూ బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బి.సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి (వీసీ) ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్ర ప్రాంగణంలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో స్త్రీ విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే అని, ఆమె చేసిన పోరాట ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, పాలక మండలి సభ్యులు ఆచార్య బి.సురేష్ లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్రా రాజు పాల్గొని నివాళులర్పించారు. వివిధ విభాగాల అధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మనువాద శక్తులపై అక్షర పోరాటం సాగిద్దాం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజంలో కుల, మత, ఆర్థిక, స్త్రీ, పురుష వివక్షతలు లేని సమానత్వ సమాజ స్థాపన కోసం విద్యార్థులంతా సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాడాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకురాలు పి.అనూష పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని పద్మాక్షి, పోతన లేడీస్ హాస్టల్స్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ కేయూ ఉపాధ్యక్షులు శ్రీజ, చందన, సహాయ కార్యదర్శులు రచన, సాధన, కోశాధికారి సంగీత, నాయకులు కీర్తి, షరీఫ్, శ్రీలత, స్వాతి, హర్షిత, భార్గవి, మమత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణలో కాంట్రాక్టర్ మొండి వైఖరి

**నరకయాతన పడుతున్న గాంధీనగర్ వాసులు**

**తవ్వకాలతో ధ్వంసమైన మంచినీటి పైపులైన్లు**



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలోని గాంధీనగర్ గ్రామస్తులకు రోడ్డు విస్తరణ పనులు శాపంగా మారాయి. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అవకతవకల కారణంగా గ్రామస్తులు తీవ్ర కష్టనష్టాలకు గురవుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో కాంట్రాక్టర్ తన మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా కాలువల తవ్వకం చేపట్టారు. అయితే తవ్విన వెంటనే కాలువల పైకప్పు (స్లాబ్) పనులు చేయకపోవడంతో ఇండ్లకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి తోడు తవ్విన మట్టిని ఇండ్ల ముందే గుట్టలు గుట్టలుగా పోయడంతో గృహ యజమానులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ అసంపూర్తి కాల్వల్లో పడి వృద్ధులు, చిన్నారులు ఎక్కడ ప్రమాదాలకు గురవుతారోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విస్తరణ పనుల్లో భాగంగా జేసీబీలతో ఇష్టానుసారంగా తవ్వడంతో మంచినీటి నల్ల పైపులైన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో గ్రామంలో మంచినీటి సరఫరా నిలిచిపోయింది. పైపులైన్లను వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నా కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ మార్కింగ్‌లో కూడా భారీగా అవకతవకలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొందరి నిర్మాణాలను తొలగిస్తూ, మరికొందరి నిర్మాణాలను పక్కన పెట్టడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రశ్నించిన వారిని కాంట్రాక్టర్లు ఖాతరు చేయడం లేదని, బాధితుల గోడు అరణ్యరోదనగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ వెంటనే తన వైఖరిని మార్చుకుని, కొత్త పైపులైన్లను వేయించి మంచినీరు అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే సైడ్ కాల్వల పనులను వెంటనే పూర్తి చేసి, ఇండ్ల ముందు ఉన్న మట్టిని తొలగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గాంధీనగర్ గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# బడుగుల విద్యా ప్రదాత సావిత్రిబాయి పూలే



**వరంగల్ వాయిస్, గణపురం/చెల్పూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత రవీందర్ మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొనగంటి మలహాలు రావు, పంచాయతీ కార్యదర్శి ముక్కెర హేమంత్, వార్డు సభ్యులు రవీందర్, శ్రీకాంత్, పొనగంటి మౌనిక, అల్లూరి సారయ్య, కొండి కుమార స్వామి పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్ కొత్త పద్మ వెంకటేశ్వర్లు, మాజీ సొసైటీ చైర్మన్ మాధవరావు, ఓనపాక రాజేంద్రప్రసాద్, దుప్పటి ప్రవీణ్, పొన్నగంటి సతీష్, రూపురెడ్డి రాజిరెడ్డి, నారమల్లె శంకర్, దారకొండ శంకర్, జితేందర్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# పాఠశాలల్లో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, గణపురం/చెల్పూర్ :** గణపురం మండంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ కావటి రజిత–రవీందర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తనిఖీలో భాగంగా సర్పంచ్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటశాలను సందర్శించి, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొనగంటి మలహాలు రావు, పంచాయతీ కార్యదర్శి ముక్కెర హేమంత్, వార్డు మెంబర్లు గంద్రత్ రవీందర్, తీగల శ్రీకాంత్, పొనగంటి మౌనిక, అల్లూరి సారయ్య, కొండి కుమార స్వామి పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచ్ కొత్త పద్మ వెంకటేశ్వర్లు, మాజీ సొసైటీ చైర్మన్ మాధవరావు, ఓనపాక రాజేంద్రప్రసాద్, దుప్పటి ప్రవీణ్, పొనగంటి సతీష్, రూపురెడ్డి రాజిరెడ్డి, నారమల్లె శంకర్, దారకొండ శంకర్, జితేందర్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శం



**వరంగల్ వాయిస్, శివనగర్:** పీడిత ప్రజల, ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ కొనియాడారు. శనివారం శివనగర్‌లోని ఎస్సీ గర్ల్స్ హాస్టల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, మహిళల సకల హక్కుల కోసం పోరాడటమే సావిత్రిబాయికి ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. నేటి విద్యార్థినులు ఆమెను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులతో సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎండి అన్వర్, మమత, ప్రవళిక, అఖిల, మమత, స్పందన, హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హంటర్ రోడ్డులోని న్యూ శాయంపేట గ్రీన్ ఫీల్డ్ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను జేఏసీ నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ చందా మల్లయ్య, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా బాలికల కోసం సావిత్రిబాయి పూలే చేసిన త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కూరపాటి రాధిక మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు విద్యావంతులైన మహిళా ఉపాధ్యాయులే మూలస్తంభాలని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మేకల సుమన్, జేఏసీ ఆర్గనైజర్ గుగులోతు రాజన్న, వలపుదాసు శ్యాంసుందర్, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ రాయల్స్ అధ్యక్షులు, జేఏసీ కార్యదర్శి పాము సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వలపుదాసు వనిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి





**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ కళాశాలలో శనివారం సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలను ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కొడిమల శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భూజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ భూజేందర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి, ముఖ్యంగా మహిళల విద్యా హక్కుల కోసం సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం మరువలేనిదన్నారు. మహిళలు విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పుడే కుటుంబంతో పాటు సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని ఆయన స్పష్టం చేశారు. మహిళా విద్యను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లిన గొప్ప దార్శనికురాలు సావిత్రిబాయి అని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, గొప్ప సామాజిక కార్యకర్తగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. 19వ శతాబ్దంలోనే ఆమె మహిళల సాధికారత కోసం ఎనలేని శ్రమించారని, ఆమె సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ రోజును జాతీయ స్థాయిలో గౌరవించుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు స్వప్న, సీనియర్ వలంటీర్లు దేవిశ్రీప్రసాద్, ఓం ప్రకాష్, అభిలాష్, నవ్య శ్రీ, మన్విత, హర్షప్రియ, శ్రీజ, మిన్ను, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మన శంకరవరప్రసాద్ గారు పోస్టర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నచిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. సంక్రాంతికి వస్తున్నాం వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. మెగాస్టార్ చిరంజీవి, నయనతార ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో వరుసగా ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. ఇప్పటికే పాటలను విడుదల చేసిన చిత్రయూనిట్.. జనవరి 4న ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. అయితే తాజాగా ఈ సినిమా విడుదలకు ఇంకా 9 రోజులు ఉందని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో చిరంజీవితో పాటు అమృతం ఫేమ్ హర్షవర్ధన్, హీరోయిన్ కేథరిన్, అభినవ్ గోమఠం ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ, ఇప్పటికే కొత్త సినిమాలకు సంబంధించి పోస్టర్లు విడుదలయ్యాయి. ఆ పరంపర ఇంకా కొనసాగుతోంది. తాజాగా వివిధ సినిమాలకు సంబంధించి పోస్టర్లను ఆయా చిత్ర బృందాలు పంచుకున్నాయి. ఇందులో హర్షవర్ధన్, కేథరిన్, అభినవ గోమఠం తదితరులు చిరంజీవి వెనక నిలబడి ఉన్నారు. మరోవైపు ఓవర్సీస్‌లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి. యూఎస్‌లో ఇప్పటికే 5వేలకు పైగా టికెట్లు విక్రయమయ్యాయి. సినిమా విడుదలకు 9 రోజుల సమయం మాత్రమే ఉండటంతో ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు చేయనున్నారు. జనవరి 3న రాజమహేంద్రవరంలో మొదలయ్యే ప్రచారం తిరుపతి, నెల్లూరు, విశాఖ, హైదరాబాద్, తాడేపల్లిగూడెం, అనంతపురం, వరంగల్, బెంగళూరుల్లో జరగనుంది. వీటిలోని కొన్ని వేదికల్లో చిరంజీవి పాల్గొంటారని సమాచారం. తిరుపతిలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దీని రన్‌టైమ్ 2 నిమిషాల 30 సెకన్లుగా అనిల్ రావిపూడి తెలిపారు.




## చైతన్యరావు దిల్ దియా మూవీ పోస్టర్ విడుదల

కీడా కోలా, ఘాటి సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో చైతన్య రావు ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నాడు. ఆయన కథానాయకుడిగా దర్శకుడు కె. క్రాంతి మాధవ్ కాంబినేషన్‌లో ఒక నూతన చిత్రం రూపొందుతోంది. ఈ సినిమాకు 'దిల్ దియా' అనే టైటిల్‌ను ఖరారు చేయగా, 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది ట్యాగ్ లైన్. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో చైతన్య సోఫాలో నగ్నంగా కూర్చోవడం చాలా విభిన్నంగా అనిపిస్తుంది. ఈ సినిమా థీమ్‌ను ప్రతిబింబించేలా ఫస్ట్ లుక్ ఉండటంతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. చైతన్య రావు ఈ సినిమాలో గత చిత్రాల కంటే భిన్నమైన గెటప్‌లో కనిపిస్తుండటం విశేషం. శ్రియాస్ చిత్రాస్, ఎ.పూర్ణ నాయుడు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై పూర్ణ నాయుడు ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. క్రాంతి మాధవ్ మార్క్ ఎమోషన్స్, చైతన్య రావు నటన ఈ సినిమాకు ప్రధాన బలం కానున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ మరియు విడుదల తేదీని ప్రకటించే అవకాశం ఉంది.

## విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిల కాంబో



### గాంధీ టాక్స్ .. మూకీ డ్రామా

భారతీయ చలనచిత్ర తెరపై దశాబ్దాల తర్వాత మళ్ళీ ఒక అద్భుత ప్రయోగం ఆవిష్కృతం కాబోతోంది. అప్పట్లో కమల్ హాసన్ నటించిన 'పుష్పక విమానం' వంటి మూకీ సినిమా ప్రేక్షకులను ఏ విధంగా మంత్రముగ్ధులను చేసిందో మనందరికీ తెలిసిందే. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత, అదే స్థాయిలో భావోద్వేగాలను పండిరచడానికి 'గాంధీ టాక్స్' అనే మూకీ డ్రామా సిద్ధమైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించబోతున్నారు. ఈ సినిమాలో మాటలు లేకపోయినా, కేవలం నటీనటుల హావభావాలు మరియు సంగీతంతోనే కథను ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు.ప్రముఖ నిర్మాణ సంస్థ 'జీ స్టూడియోస్' ఈ చిత్రాన్ని గాంధీజీ వర్ధంతి సందర్భంగా జనవరి 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఇది మూకీ సినిమా అయినప్పటికీ.. తెలుగు, తమిళం, హిందీ, మరాఠీ మరియు మలయాళ భాషల్లో టైటిల్ కార్డులు, ప్రమోషన్లతో గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిలతో పాటు అందాల నటి అదితి రావు హైదరి, మరాఠీ నటుడు సిద్దార్థ్ జాదవ్ కీలక పాత్రల్లో నటించారు. మాటలు లేని ఈ సినిమాలో సంగీతమే ప్రాణం. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ అద్భుతమైన స్వరాలను అందిస్తున్నాడు. కిషోర్ పి. బేలేకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఉమేష్ కుమార్ బన్సల్, రాజేష్ కేజ్రీవాల్, మీరా చోప్రా, కిషోర్ పాండురంగ్ బేలేకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## వారెవ్వా.. ఏమి ఫేసు

ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోలు కావాలనుకుని ఇండస్ట్రీకి వచ్చి దర్శకులుగా స్థిరపడినవారు ఉన్నట్లే, దర్శకత్వ రంగంలోకి వచ్చి హీరోలుగా మారిన ఉదాహరణలూ ఉన్నాయి. నాని, రాజ్ తరుణ్ లాంటి వారు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పని చేసి తర్వాత హీరోలుగా సక్సెస్ సాధించారు. మరోవైపు కొందరు సక్సెస్‌ఫుల్ దర్శకులు కూడా హీరోగా మారాలని ప్రయత్నించి ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో టాలీవుడ్‌లో వరుస హిట్లతో దూసుకెళ్తున్న దర్శకుడు అనిల్ రావిపూడి హీరోగా మారతారా? అన్న ప్రశ్న తరచూ సోషల్ మీడియాలో వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై అనిల్ రావిపూడి ఇచ్చిన సమాధానం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. హీరోగా సినిమా చేయొచ్చుకదా అని అడిగినప్పుడు అనిల్ రావిపూడి చాలా మెచ్యూర్డ్‌గా స్పందించారు. మనమొక క్రాఫ్ట్‌లో టాప్‌లో ఉన్నప్పుడు పక్కదారి పట్టించడానికి ఇలాంటి ప్రలోభాలు వస్తాయి. వాటికి లొంగితే ఇప్పటికే ఉన్న కెరీర్‌కే ప్రమాదం. అందుకే ఆ ట్రాప్‌లో నేను పడను. నాకు హీరోగా మారాలనే ఉద్దేశం ఏమాత్రం లేదు. డైరెక్షన్‌పైనే పూర్తి దృష్టి పెడతాను అని ఆయన స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తుంది. టాలీవుడ్‌లో దర్శకుడు రాజమౌళి తర్వాత ఫెయిల్యూర్ లేని ట్రాక్ రికార్డ్ ఉన్న డైరెక్టర్‌గా అనిల్ రావిపూడికి మంచి పేరు ఉంది. ఆ రికార్డును కాపాడుకోవడమే తన ప్రధాన లక్ష్యమని, నటన వైపు వెళ్లి ఫోకస్ డైవర్ట్ చేయాలనే ఆలోచన తనకు లేదని ఆయన మరోసారి క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం అనిల్ రావిపూడి పూర్తిగా మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాపైనే దృష్టి పెట్టారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, జనవరి 03, 2026



# సమష్టిగా కొండగట్టు అభివృద్ధి

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**వరంగల్ వాయిస్, కొండగట్టు :** 'ఆంజనేయస్వామి అందరి దేవుడు, విశ్వాంతర్యామి.. ఆయన ఓ ప్రాంతానికి మాత్రమే దేవుడు కాదు.. మా ఇలవేల్పు ఆంజనేయ స్వామి వారికి సేవ చేసుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.. కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ మార్గాన్ని కూడా సాకారం చేద్దాం.. సమష్టిగా స్వామి వారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేద్దాం' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శనివారం కొండగట్టుకు చేరుకున్న పవన్ కళ్యాణ్ కు వేదపండితులు శాస్త్రోక్తంగా, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి దర్శనం చేయించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కొండగట్టు స్థానం ఎంత శక్తిమంతమైందంటే తెలంగాణకు పూర్తిస్థాయి రక్షణ, బలంగా మారుతుందన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షిణకు ప్రయత్నం మొదలుపెట్టండి అని సూచించారు. నేను స్వయంగా వచ్చి కరసేవ చేసి ఈ కార్యక్రమంలో పాల్గొంటానన్నారు.



కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.35.19 కోట్లతో వసతి సముదాయం, దీక్షా విరమణ మండపం నిర్మాణాలకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో మొత్తం 96 గదుల వసతి సముదాయం, 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా అతి పెద్ద మండపం అందుబాటులోకి రానున్నాయి. 2024 ఎన్నికల ముందు వారాహి యాత్ర ప్రారంభ సమయంలో కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి దర్శనానికి శ్రీ పవన్ కళ్యాణ్ వచ్చినపుడు ఆలయంలో వసతి సముదాయం, దీక్షా మండపం అవసరాన్ని ఆలయ అధికారులు, పండితులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, దేవాదాయశాఖ కమిషనర్ హరీష్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్లు, ఆనందసాయి, మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్ఏసీ ఛైర్మన్ శంకర్ గౌడ్, పోలీస్ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి తదితరులు పాల్గొన్నారు.



# చిరు ధ్యాన్యాలతో ఆరోగ్యం

### ☐ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతదేశం గో ఆధారిత, సేంద్రియ వ్యవసాయానికి పెట్టింది పేరని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి అన్నారు. నేటి ఆధునిక యుగంలోనూ కొందరు రైతులు సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులను కొనసాగిస్తూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ రైతుల సంత రెండో రోజు శనివారం ప్రారంభ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా విచ్చేసి సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను పరిశీలించి రైతులతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. సేంద్రియ ఉత్పత్తుల తయారీ విధానాలు, మార్కెటింగ్ విధానం, వినియోగదారుల స్పందన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లెట్స్‌తో తయారు చేసిన కిచిడీ రుచి చూసిన ఏసీపీ, చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉన్నాయని తెలిపారు. చిన్ననాటి నుంచే పిల్లలకు ఇలాంటి ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు. మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ పాఠశాలల్లో చిన్నారులకు చిరుధాన్యాలతో చిరుతిళ్లు అనే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సంత నిర్వాహకులు భయ్య సారయ్య, నిమ్మల శ్రీనివాస్ తదితరులను ఏసీపీ అభినందించారు. స్టాల్ యజమానులు ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య దంపతులు, సంతోష్, కృష్ణ ప్రసాద్, సంగీత్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. న్యాచురల్ మరియు ఆర్గానిక్ సంత రేపు సాయంత్రం 9 గంటల వరకు కొనసాగుతుందని మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం పబ్లిక్ గార్డెన్ వాకర్స్‌కు చిరుధాన్యాలతో తయారు చేసిన జావను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.



# క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రొఫెసర్ కోదండరాం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పెరికకుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) 2026 క్యాలెండర్ ను శనివారం తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం తార్నాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిక కుల సమస్యల పరిష్కారం కోసం కులస్తులు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పెప్సీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్ మాట్లాడుతూ పెప్సీ ద్వారా పెరికకుల ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ అందరినీ ఒక తాటిపైకి తీసుకవచ్చే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే 33 జిల్లాలలో కమిటీలను వేసి తద్వారా ఐక్యతను చాటుతున్నట్లు చెప్పారు. బీసీలల్లో గుర్తింపు పొందాలంటే అందరం ఐక్యంగా ఉండాలన్నారు. కులవృత్తి విధ్వంసమై, ఆర్థికంగా చతికెలబడ్డ కులానికి పెరికకుల కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం సార్ చేతుల మీదుగా క్యాలెండర్ ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెప్సీ ముఖ్య సలహాదారు చింతం లక్ష్మినారాయణ, రాష్ట్ర కోశాధికారి అప్పని సతీష్ కుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లా పెప్సీ అధ్యక్షులు ఆకా రాధాకృష్ణ, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బెడుద వెంకటయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బండి శ్రీకాంత్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి శ్రీరామ్ వీరయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### ☐ ఎర్రబెల్లి దయాకర్ రావు, చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండలోని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో పరకాల పట్టణ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ చేసిన సేవలను ప్రజలకు గుర్తుచేయాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగితే పరకాలలో ఘన విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు ఆక్రమణలపై నజర్

### వడ్డేపల్లి నుంచి గోకుల్ జంక్షన్ వరకు ఆక్రమణలు తొలగింపు

**వరంగల్ వాయిస్, కాజీపేట :** రోడ్డు ఆక్రమణలపై కాజీపేట ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. కొందరు వ్యాపారులు షాప్ షెటర్స్ దాటి పైన రేకుల షెడ్లు వేయడం, రోడ్డుపైనే సైన్ బోర్డులు పెట్టడాన్ని సీరియస్ గా తీసుకున్నారు. వడ్డేపల్లి క్రాస్ రోడ్ నుంచి గోకుల్ జంక్షన్ వరకు ఉన్న ఆక్రమణలను మున్సిపల్ శాఖ, డీఆర్ఎఫ్ వారి సహకారంతో కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో తొలగించారు. . ఈ కార్యక్రమంలో కాజీపేట ఎస్సైలు శ్రవణ్, కనక చంద్రము, కాజీపేట ట్రాఫిక్ సిబ్బంది, మున్సిపల్ శాఖ డీఆర్ఎఫ్ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com